

తరగతి గదిలో పాఠాలు వింటున్న కలెక్టర్ పమేలా సత్పతి

‘బుధవారం బోధన’లో కఠినమైన పాఠ్యాంశాలు

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కఠినమైన పాఠ్యాంశాలను నేర్పించేందుకు బుధవారం బోధన కార్యక్రమం ఉపయోగపడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి పర్యవేక్షించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కూరలు ఎక్కువగా తినాలని, ఆకు కూరలు, గుడ్లు, తప్పకుండా తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ఏమైనా అవసరాలు ఉంటే వెంటనే కల్పించాలని విద్యాధికారిని ఆదేశించారు. విద్యార్థులు చేతులు కడుక్కునే చోట నల్లాలు లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎంఈవో రవీందర్ పాల్గొన్నారు.

ఎగ్ బిర్యానీ ఎక్కడ?

- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదురుచూపులు
- ఉన్న వస్తువులతోనే సరిపుచ్చాలంటూ సూచనలు



గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ పౌష్టికాహారంతోనే చిన్నారుల్లో శారీరక వికాసం కలుగుతుంది. సరైన సమయంలో బలవర్ధకమైన ఆహారం అందిస్తే ఎదుగదల బాగుంటుంది. పిల్లల్లో చురుకుదనం పెరుగుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకందించే పౌష్టికాహార మెనూలో మార్పులు తెస్తున్నామని తెలిపింది. ప్రసుత మెనూతోపాటు వారానికి రెండు రోజులు ఎగ్ బిర్యానీ అందజేసేందుకు శాశ్వత కార్యాచరణ పథం రూపొందిస్తున్నామని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గత విద్యాసంవత్సరం ముగింపు దశలో ప్రకటించారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం అనంతరం కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఎగ్ బిర్యానీ అందించిన అధికారులు మెనూ మార్చినట్లు ప్రకటించారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు పౌష్టిక హారం అందుతుందని సంతోషించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో వారానికి ఒకరోజైనా చిన్నారులకు ఎగ్ బిర్యానీ కచ్చితంగా పంపిణీ చేయాలంటూ అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

పర్యవేక్షణ కరువు

మారిన మెనూపై పర్యవేక్షణ లేకపోవడంతో ఎగ్ బిర్యానీ పథకం నిలిచిపోయింది. ఈ పథకానికి ఎలాంటి అదనపు కేటాయింపుల్లేకపోవడం, బిర్యానీ తయారు చేసేందుకు అవసరమైన సామగ్రి పంపిణీ చేయలేదు. ఈ ఖర్చు మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలే భరించాల్సి రావడం భారంగా మారింది. దీంతో టీచర్లు చేతులెత్తేశారు. ఈ పథకం అమలు ఆరంభశూరత్వంగా మారగా, ఎగ్ బిర్యానీ పథకం ఒక్క రోజు ముచ్చటగా మారిందని చిన్నారుల తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు. జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిలో 18,808 మంది చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. గర్భిణులు 4,587 మంది, బాలింతలు3,513 మంది ఉన్నారు. వీరందరికీ గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనంతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. బాలింతలు, గర్భిణులు, మూడేళ్లలోపు పిల్లలకు నెలకు 16గుడ్లు 3, ఏళ్లలోపు పిల్లలకు రోజుకో గుడ్డు చొప్పున అందజేస్తున్నారు. నిత్యం ఒకే రకంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తుండగా, కొంత మంది పిల్లలు కేంద్రాల్లో భోజనం చేసేందుకు ఇష్టపడడం లేదు. గుడ్డు మాత్రమే తీసుకొని, మిగతా ఆహారం వదిలేస్తుండడం సాధారణంగా మారింది. దీనిని గమనించి మెనూ మార్చి చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖను ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అవసరమైన ఖర్చులపై ఎలాంటి ప్రకటనా చేయలేదు కచ్చితంగా అమలు చేయాలనే ఆదేశాలు లిఖితపూర్వకంగా విడుదల చేయలేదు. పిల్లలకందించే గుడ్లతో మాత్రమే బిర్యానీ తయారు చేసి పంపిణీ చేయాలంటూ సంబంధిత అధికారులు టీచర్లకు సూచించడంతో ప్రారంభించి ముడు వారాలు మాత్రమే పిల్లలకు అందించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తమ పిల్లలకు సంపూర్ణ పౌష్టికాహారం అందుతుందని ఆశిస్తే నిరాశే మిగులుతున్నదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వం ఎగ్ బిర్యానీ పథకాన్ని కొనసాగించాలని కోరుతున్నారు.

ధాన్యం సేకరణకు కార్యాచరణ

- ప్రారంభమవుతున్న కొనుగోలు కేంద్రాలు
- ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- మార్కెట్‌కు మూడు లక్షల టన్నులు వస్తుందని అంచనా
- జిల్లావ్యాప్తంగా 325 కొనుగోలు కేంద్రాలు
- 72 గంటల్లో డబ్బు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వానాకాలంలో పండిన ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సీజన్‌లో సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, దానిలో మూడు లక్షల టన్నుల మేరకు కొనుగోలు కేంద్రాలకు రైతులు విక్రయిస్తారని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ తయారు చేసిన కార్యాచరణను పకడ్బందీగా అమలులో పెట్టి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని భావిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఈ వానాకాలం వ్యవసాయశాఖ సమాచారం మేరకు 2,76,879 ఎకరాల్లో వరి సాగు జరిగింది. దీనిలో 1,53,787 ఎకరాల్లో దొడ్డు రకాలు, 1,23,092 ఎకరాల్లో సన్న రకాలను రైతులు సాగు చేశారు. సన్న రకాల్లో ఎకరాకు 20.23 క్వింటాళ్లు, దొడ్డురకం ఎకరాకు 22.37 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు 2,60,938 మెట్రిక్ టన్నుల సన్న రకాలు, 3,36,991 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడిగా వస్తుందని భావిస్తున్నారు. జిల్లాలో దిగుబడిగా వచ్చిన 5,97,929 మెట్రిక్ టన్నుల ధాన్యంలో విత్తన పంట, రైతులు విత్తనాలుగా ఉపయోగించుకోవడానికి మినహాయించుకొనే ధాన్యం 94,493 మెట్రిక్ టన్నులు ఉంటుంది. రైతులు ఆహారం కోసం వినియోగించుకునే ధాన్యంతో పాటు ప్రైవేట్ మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం రెండు లక్షల మెట్రిక్ టన్నుల మేరకు ఉంటుందని భావిస్తున్నారు. సివిల్ సప్లయిస్ శాఖ అంచనాల మేరకు 3,01,880 మెట్రిక్ టన్నుల కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. కొనుగోలు కేంద్రాలకు 1,68,025 మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 1,33,855 మెట్రిక్ టన్నుల సన్నరకాల వస్తుందని భావిస్తున్నారు.

జిల్లాలో 325 కొనుగోలు కేంద్రాలు

ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా 325 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 184, ఐకేపీ ద్వారా 161 , డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 36, హాకా ఆధ్వర్యంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు జిల్లాలో 79 బాయిల్డ్ మిల్లులు, 48 రా రైస్‌మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లుల మిల్లింగ్ సామర్థ్యం 5,92,000 మెట్రిక్ టన్నులు, జిల్లాలో పండిన మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినా మిల్లింగ్ చేసే సామర్థ్యం జిల్లా రైస్ మిల్లర్లకు ఉంది.

కొనుగోలు కేంద్రాల్లో సామగ్రి

జిల్లాలో 325 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో ధాన్యంపై కప్పేందుకు 10,522 టార్పాలిన్లు అవసరమని గుర్తించారు. 187 ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, 360 ధాన్యం కొలిచే యంత్రాలు, 769 ఎలక్ట్రానిక్ బరువు తూచే మిషన్లు, 360 పీల్డ్ రిమూవర్స్ ధాన్యం ఆరబెట్టే యంత్రాలు రెండు, వీటిలో 3,574 టార్పాలిన్లు, 171 ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, 360 పీల్డ్ బ్యాలెన్సులను తెప్పించాల్సి ఉన్నది.

సన్న రకాలకు బోనస్

ప్రభుత్వం గత రబీ సీజన్ నుంచి సన్న రకాలకు క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లించాలని నిర్ణయించింది. ఈసారి 1,33,855 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని

(మిగతా 8వ పేజీలో)



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టూ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు శక్తి ఆలయ ప్రాంతం, సంతోష్ నగర్, సంతోషి మాత ఆలయం, బాలాజీ సూపర్ మార్కెట్, ఉదయం 8 గంటల నుంచి 10 వరకు వావిలాల పల్లిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న వైన్స్ దరఖాస్తుల స్వీకరణ

- జిల్లాలోని 94 వైన్‌షాపులకు ఇప్పటి వరకు 2,653 దరఖాస్తులు
- 27న లాటరీ ద్వారా లైసెన్సీల ఎంపిక



కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపుల లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు గడువు గురువారంతో ముగియనుంది. జిల్లాలోని 94 వైన్‌షాపుల లైసెన్స్‌ల జారీ కోసం సెప్టెంబరు 26న ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మొదట ఈ నెల 18 వరకు దరఖాస్తులకు గడువును విధించగా 18న 1,601 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 2,635 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా వైన్‌షాపులకు అనుకున్న మేరకు దరఖాస్తులు రాకపోవటంతో దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 23 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ గడువు కూడా గురువారంతో ముగియనుంది. సోమ, మంగళ, బుధవారాల్లో జిల్లాలో మరో 18 దరఖాస్తులు రాగా మొత్తం 2653 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు మరిన్ని దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు ఆశిస్తున్నారు.

తగ్గిన దరఖాస్తులు

గత ఎక్సైజ్ సంవత్సరంలో 2023-25కు నిర్వహించిన వైన్స్ టెండర్లలో 4,040 దరఖాస్తులురాగా ప్రస్తుతం 2,653 మాత్రమే రావడంతో గతంలోకంటే 1,447 దరఖాస్తులు తగ్గాయి. ఒక వైపున సమయం దగ్గరపడుతుండడం... మరో వైపున దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రాకపోవటంతో ఎక్సైజ్ అధికారుల్లో టెన్షన్ నెలకొంది. దరఖాస్తులు తక్కువ సంఖ్యలో రావడానికి 2 లక్షల ఫీజును 3 లక్షలుగా పెంచటమే కారణంగా చెబుతున్నారు. దరఖాస్తుఫీజు లక్ష రూపాయలుగా ఉంటే రెట్టింపుగా దరఖాస్తులు వచ్చేవని, మూడు లక్షలు పెంచినకారణంగా ఇప్పటికే మద్యం వ్యాపారంలో ఉన్నవారు మినహా ఈ వ్యాపారంలోకి కొత్తగా వచ్చేవారు, ఇతరులు వెనకడుగు వేస్తున్నట్లు చెబుతున్నారు. 2019-21 ఎక్సైజ్ సంవత్సరంలో 87 వైన్‌షాపులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 1,375 దరఖాస్తులురాగా ఇందులో చివరి 3 రోజుల్లోనే 1,200 దరఖాస్తులు వచ్చాయి. 2021-23 ఎక్సైజ్ సంవత్సరంలో 94 వైన్‌షాపులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 1,720 దరఖాస్తులురాగా ఇందులో చివరి 3 రోజుల్లోనే 1,577 దరఖాస్తులు వచ్చాయి. 2023-25 ఎక్సైజ్ సంవత్సరంలో 94 వైన్‌షాపులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 4,040 దరఖాస్తులురాగా ఇందులో చివరి రోజునే రికార్డుస్థాయిలో 2,097 దరఖాస్తులు వచ్చాయి.

2025-27లో ఉమ్మడి జిల్లాలోని వైన్‌షాపులకు వచ్చిన దరఖాస్తుల వివరాలు....

జిల్లా	వైన్‌షాపులు	ఇప్పటివరకు దరఖాస్తులు
కరీంనగర్	94	2,653
పెద్దపలి	74	1,394
రాజన్నసిరిసిల్ల	48	1,333
జగిత్యాల	71	1,847
మొత్తం	287	7,227

సిండికేట్‌లదే హవా....

జిల్లాలో మద్యం వ్యాపారమంతా 7, 8 సిండికేట్ గ్రూపుల చేతిలోనే నడుస్తున్నది. ఈ గ్రూపులు 50 నుంచి 300 వరకు దరఖాస్తులు చేసినట్లు సమాచారం. కరీంనగర్‌లో ప్రధానంగా 4, 5 గ్రూపులు, హుజురాబాద్ ప్రాంతంలో మరో 2, 3 గ్రూపులు భారీ సంఖ్యలో ఈ నెల 18న వైన్‌షాపులకు దర ఖాస్తులు చేసుకున్నాయి. మొదట నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా చివరి గడువు 18న ఈ సిండికేట్ గ్రూపులు అర్ధ రాత్రి వరకు కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద కూర్చుండి దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తక్కువ దరఖాస్తులు వచ్చిన వైన్‌షాపులకు సిండికేట్ గ్రూపులు పదుల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. అర్ధరాత్రి తరువాత గడువును పొడిగించారు. గడువును ఐదు రోజులు పొడిగించినప్పటికీ ఆదివారం, సోమవారం దీపావళి సెలవు రోజులు. దీంతో మంగళ, బుధ, గురువారం మూడు రోజులు మాత్రమే దరఖాస్తుల చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. వైన్‌షాపుల దరఖాస్తు ఫీజు మూడు లక్షలకు పెంచడంతోపాటు, మద్యం బడా వ్యాపారులంతా సిండికేట్‌గా మారి వందల సంఖ్యలో దరఖాస్తులు చేస్తున్నారు. దీంతో కొత్తగా ఒకటి రెండు దరఖాస్తులు వేసేందుకు కొత్త వ్యాపారులు వెనుకంజవేస్తున్నట్లు సమాచారం. వైన్‌షాపుల దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగుస్తుండగా ఈ నెల 27న కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపికచేయనున్నారు. ఎంపికయ్యే లైసెన్సీలు డిసెంబరు 1వ తేదీ నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు వైన్‌షాపులను నిర్వహించుకోవచ్చు.

2023-25లో ఉమ్మడి జిల్లాలోని వైన్‌షాపులకు వచ్చిన దరఖాస్తుల వివరాలు....

జిల్లా	వైన్‌షాపులు	ఇప్పటివరకు దరఖాస్తులు
కరీంనగర్	94	4,040
పెద్దపలి	77	2,022
రాజన్నసిరిసిల్ల	48	2,036
జగిత్యాల	71	2,636
మొత్తం	290	10,734

ఆన్‌లైన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

- ప్రజలకు షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు
- పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో జిల్లా వాసులు భాగస్వాములు కావాలి
- పోలీసు కమిషనర్ గౌస్‌ఆలం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు విద్యార్థులకు, ప్రజలకు వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 22 నుంచి 28వ తేదీ వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు రాసిన వ్యాసాలను అక్టోబరు 28 వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సీపీ సూచించారు. ప్రతి భాష నుంచి కమీషనరేట్‌లో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోలీసులకు సంబంధించిన అంశాలపై షార్ట్ ఫిల్మ్, ఇటీవల తీసిన పోలీసులకు సంబంధించిన ఫొటోల కాంపిటేషన్ నిర్వహిస్తామన్నారు. పోటీలో పాల్గొనే వారు షార్ట్‌ఫిల్మ్, ఫొటోలను ఈ నెల 28 వరకు కమీషనరేట్‌లోని పోలీస్ కమీషనర్ కార్యాలయంలోని ఐటీ కోర్ కార్యాలయంలో అందజేయాలన్నారు.ఈ పోటీల్లో కమిషనరేట్ స్థాయిలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనపై కొరడా

- పెండింగ్ చలాన్ల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్
- 50 చలాన్ల పైన ఉన్నవి 301 వాహనాలు
- వాటిపై రూ.64.39 లక్షల జరిమానా

7

జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు



చెంజర్లలో ఆర్డీవోతో మాట్లాడుతున్న రైతులు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంజర్లలో జరుగుతున్న జాతీయ రహదారి పనులను బుధవారం గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన భూమిలో జాతీయ రహదారి పనులు చేపట్టడానికి ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, సీఐ సంజీవ్, ఎస్ఐ స్వాతి పోలీసు బందోబస్తుతో వెళ్లారు. రైతులు బోళ్ల వేణుగోపాల్, సుదగోని తిరుపతిగౌడ్ పనులను అడ్డుకున్నారు. తమకు నోటీసులు ఇవ్వకుండా పనులు ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించారు. నష్టపరిహారం విషయంలో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు కోట్ల విలువైన భూమిని కోల్పోతే అతి తక్కువ నష్టపరిహారం చెల్లిస్తున్నారని తెలిపారు. వెంటనే నష్టపరిహారం పెంచి భూమిని తీసుకోవాలని అధికారులను వేడుకున్నారు. రైతులకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు వెళ్లిపోయారు. అనంతరం రహదారి పనులను అధికారులు కొనసాగించారు.

గంజాయి సాగు చేస్తున్న ముగ్గురి అరెస్టు

కోరుట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ శివారులోని బర్ల కొట్టం సమీపంలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి సాగు చేస్తున్న గంజాయితో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. పట్టణంలోని హాజీపురకాలనీలోని బర్ల కొట్టం సమీపంలోని చెట్ల పొదల్లో గంజాయి సాగు చేస్తున్న విషయం తెలుసుకున్న కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవి తనిఖీలు నిర్వహించారు. సాగు చేస్తున్న గంజాయిని వ్యవసాయ అధికారి నాగమణి సమక్షంలో పరిశీలన జరిపి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్ తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

చిగురుమామిడి,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబుపేట గ్రామంలో బుధవారం వ్యవసాయ బావుల వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు బావుల వద్ద పేకాట ఆడుతన్నారని వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ. 1700 నగదు దొరికినట్లు తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, గంజాయి విక్రయించినట్లు ఉన్నా సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయని అన్నారు.

వెల్గటూర్ : మండలంలోని చెగ్యాం గ్రామ శివారులో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం చెగ్యాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ పోలీసులు, వెల్గటూర్ పోలీసుల ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద లభించిన రూ.58 వేలు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రంగసాగర్ వద్ద గోదావరిలో మృతదేహం లభ్యం

బీర్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామ శివారులోని గోదావరి నదిలో ఐళ్ల మడుగు వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని గుర్తించిన గ్రామ కార్యదర్శి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ జిల్లా చేపూర్ గ్రామానికి చెందిన కనికారపు సుజాత సంఘటన స్థలానికి చేరుకుని ఇతను తన భర్త కనికారపు గంగాధర్ అని తెలిపారు. గంగాధర్ బావ మరిది గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోగా మృతుని శవాన్ని వెతికేందుకు గంగాధర్ గోదావరి నదిలోకి వెల్లగా వరద ప్రవాహం ఎక్కువై ఆ ప్రవాహంలో తన భర్త కొట్టుకు పోయాడని పేర్కోంది. పోలీసులు మృతదేహనికి పంచనామా నిర్వహించి భార్యకు అప్పగించారు. మృతుడి భార్య తెలిపిన వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా



పెండింగ్ చలాన్ల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్
50 చలాన్ల పైబడినవి 301 వాహనాలు
వాటిపై రూ.64.39 లక్షల జరిమానా

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనల అమలును మరింత కఠినతరం చేయాలని సీపీ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు. పెండింగ్ చలాన్ల వసూలులో భాగంగా స్పెషల్ డ్రైవ్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశారు. ఇప్పటి కే కమిషనరేట్ వ్యా ప్తంగా 50 చలాన్ల పైఉన్న 301 వాహనాలను గుర్తించారు. ఈ వాహనాలపై రూ.64 లక్ష ల 39 వేల 715 జరిమానా పెండింగ్‌లో ఉంది. కమిషనరేట్ వ్యాప్తం గా అక్టోబరు 17వ తేదీ నాటికి మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలకు 50 సార్లు, ఆపై పాల్పడి జరిమానా చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వాహనదారులను పట్టుకొని చలాన్, జరిమానా వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 100 ఆపై వరకు పెండింగ్ చలాన్లు ఉండి జరిమానా చెల్లించని వాహనాలు 60 వరకు ఉన్నాయి. వాటిపై ఉన్న జరి మానా మొత్తం 21 లక్షల 83 వేల 875 రూపాయ లుగా గుర్తించారు. 50 నుంచి 100 వరకు పెండింగ్ చలాన్లు కలిగిన 241 వాహనాలను గుర్తించారు. వాటి జరిమానా మొత్తం 42 లక్షల 55 వేల 840 రూపాయలు.



స్పెషల్ డ్రైవ్

పెండింగ్ చలాన్లు వసూలు చేసేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు తక్షణమే రంగంలోకి దిగాలని సీపీ ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు, వాహనదారులు లేకుండా చూడాలని, ఈ విషయంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. దీంతో కొద్ది రోజులుగా కమిషనరేట్ వ్యాప్తంగా వాహన తనిఖీలను ముమ్మరం చేశారు.

వాహనాలను స్వాధీనం చేసుకుంటాం
గౌస్ ఆలం, పోలీస్ కమిషనర్



పెండింగ్ చలాన్లు కలిగిన వాహన దారులు తక్షణమే చెల్లించాలి. లేనట్లయి తే తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను స్వాధీనం చేసుకుంటాం. మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. కమిషనరేట్ లో పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు లేకుండా చూడాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం.

ద్విచక్రవాహనం అదుపు తప్పి అంగన్‌వాడీ ఆయా మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులో బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని అంగన్‌వాడీ ఆయా దొబ్బల మరియ(58) దుర్మరణం చెందింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని సమీప బంధువు మృతి చెందడంతో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని అంగన్‌వాడీ ఆయా మరియ తన చిన్నకొడుకు ప్రభాకర్‌తో కలిసి బైక్‌పై వస్తోంది. అక్కపల్లి గ్రామ శివారులో బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడింది. తీవ్రగాయాల పాలైన మరియను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు మహేశ్, ప్రభాకర్‌లు ఉన్నారు. మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.



మరియ(ఫైల్)

నేరెళ్ల వద్ద బైక్ పైనుంచి పడి మృతి

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వేముల పుష్ప (50) అనే మహిళ బుధవారం సాయంత్రం మృతి చెందింది. గ్రామానికి చెందిన పుష్ప మరో మహిళ కాసారపు గౌరమ్మ పత్తి ఏరి కాసారపు సంతోష్‌కు చెందిన టీఎస్ 02 ఈటీ 5912 అనే నెంబర్ బైక్ పైన ఇంటికి బయలు దేరారు. సరిగా రోడ్డు పైకి వచ్చే సరికి బర్రెలు అడ్డురావడం వల్ల బైక్ పైనుంచి కింద పడి పుష్ప మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు జగిత్యాల మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు బుధవారం వన్‌టౌన్‌లో సీఐ రాంచందర్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీటర్ల సత్ప్రవర్తనతో ఉండాలని, నేరఘటనల్లో పాల్గొనవద్దని సూచించారు. కొంతకాలంపాటు సత్ప్రవర్తనతో మెదిలిన వారి రికార్డులను పరిశీలించిన తరువాత షీట్‌ల ఎత్తివేతకు సిఫారసు చేసే అవకాశముందన్నారు. రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై పోలీసు నిఘా నిత్యం ఉంటుందని హెచ్చరించారు. నేరఘటనల్లో జోక్యం చేసుకుంటే వ్యక్తిగతంగానూ, సమాజపరంగానూ మరిన్ని సమస్యలు ఎదురవుతాయన్నారు. కౌన్సెలింగ్‌లో ఎస్సై భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

జగిత్యాలరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాతో పాటు నిజామాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. ఈనెల 13న జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని ధరూర్ గ్రామంలో నాలుగు ఇళ్లలో తెల్లవారుజామున తాళాలు పగులకొట్టి బంగారు, వెండి, నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు దొంగల కోసం గాలింపు చేపట్టి మహారాష్ట్రకు చెందిన మ్యాకల్‌వర్ సాయినాథ్, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన ముండె శ్రీకాంత్, షైనర్ బాలుడిని బుధవారం ధరూర్ బైపాస్ రోడ్డులో కారులో వెళ్తుండగా పట్టుకున్నట్లు డీఎస్పీ రఘచందర్ తెలిపారు. కొంతకాలంగా ఈ ముఠా జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో పలు చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరి నుంచి 24.5 గ్రాముల బంగారం 19 వేల నగదు, ఓ కారు, సెల్‌పోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాకు చెందిన మహారాష్ట్రలోని హింగోళి జిల్లాకు చెందిన మార్కులే అనిల్‌తో పాటుగా మరికొంతమంది పరారీలో ఉన్నారని, వీరిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.



దొంగల ముఠా అరెస్ట్ చూపుతున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ తీగల వంతెన వద్ద కారు ఢీకొని 'ఆంధ్రజ్యోతి' ఉద్యోగి కాల్వ శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం తీగల వంతెన సమీపంలోని ఐలాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు శంకర్‌ను ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని కారు నడుపుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ పైనుంచి దూకి ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి బాబు(30) అనే వ్యక్తి బుధవారం రాత్రి సెల్‌టవర్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బాబు మామిడిపల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. కొన్ని రోజుల క్రితం గల్ఫ్‌దేశం వెళ్లి ఈ మధ్యనే ఇంటికి వచ్చాడు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



బాబు(ఫైల్)

ఇరాక్‌లో పెగడపల్లి వాసి మృతి

పెగడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది గంటల్లో విమానం ఎక్కి ఇరాక్ నుంచి స్వస్థలానికి వచ్చేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటుతో పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి (నిమ్మని) రమేష్ (55) అనే వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. బతుకుదెరువు కోసం రమేష్ ఏడాది క్రితం ఇరాక్ వెళ్లాడు. అక్కడ విధులు నిర్వహిస్తూ బుధవారం స్వదేశానికి వచ్చేందుకు విమాన టికెట్ బుక్ చేసుకున్నాడు. మంగళవారం రాత్రి గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలించేలోపే రమేష్ మృతిచెందినట్లు స్నేహితుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. రమేష్ మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రమేష్ (ఫైల్)

రాజీవ్‌రహదారి పక్కన గుర్తు తెలియని బైక్

● కొన్ని రోజులుగా ఒకే చోట ఉన్నట్లు గర్తింపు

తిమ్మాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో డైట్ కళాశాలకు ఎదురుగా రాజీవ్ రహదారి పక్కన ఓ ద్విచక్ర వాహనం కొన్ని రోజులుగా ఒకే చోట ఉంది. అయితే అ బైక్ ఎవరిది, ఇందుకు ఇలా రాజీవ్ రహదారి పక్కన వదిలేని వెళ్లారనే సందేహం వ్యక్తం అవుతోంది. బైక్ ముందు వైపు ఏపీ 37 ఏఫై 2219 నెంబర్ ప్లేట్ ఉండగా, వెనుక వైపు నంబర్ లేదు. అయితే ఈ వాహనం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2010లో రిజిస్ట్రేషన్ అయినట్లు తెలుస్తున్నది. ఏపికి చెందిన ఈ వాహనం ఇలా రాజీవ్ రహదారి పక్కన వదిలి వెల్లడంపై అనుమలకు దారి తీస్తోంది. వాహనం పాడై ఇక్కడే వదిలేసి వెళ్లారా, లేదా ఎవరైనా బైక్‌ను దొంగిలించి ఇక్కడ వదిలి వెళ్లారా అనే , లేదా ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. ఎప్పుడు, ఎవరు, ఎందుకు ఈ బైక్‌ను రాజీవ్ రహదారిపై వదిలి వెళ్లారు, బైక్ వదిలి వెళ్లిన వారు ఎవరై ఉంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై పూర్తి స్థాయిలో దార్యాప్తు చేస్తే విషయం బయటికి వచ్చే అవకాశం ఉన్నది.



రాజీవ్‌రహదారి పక్కన నిలిపిన బైక్

పొలాస ఏపీటీ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర సందర్శనలో భాగంగా వైస్ ప్రిన్సిపాల్ స్వాతి సూచనల మేరకు పొలాస అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. టీచింగ్ అసోసియేట్ అశ్ఫక్ నేతృత్వంలో పార్టిసిపేటరీ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌లో వివిధ విభాగాల పనితీరును గురించి అడిగి తెలుసుకున్నారు.

కొనుగోళ్లు, అమ్మకాల ప్రక్రియ, ఆడ్తిదారులు, కమిషన్ విధానం, ఈ నామ్ విధానం, ఏ ధాన్యాలు, కొనుగోళ్లు, ఎంత ధరకు కొనుగోలు చేస్తారనే తదితర అంశాలపై విద్యార్థులు మార్కెట్ అధికారులను, ఆడ్తిదారులను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. టీచింగ్ అసోసియేట్ పూజితతో పాటు ఆడ్తిదారు నలువాల తిరుపతి, ఏపీటీ కళాశాల విద్యార్థులున్నారు.



వ్యవసాయ మార్కెట్‌లో విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాదర్ గూడెం గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి చెందిన వంగ రాయమల్లు అనే వ్యక్తి అతని మనుమరాలుతో సహా మోటారు సైకిల్‌పై వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా చెంజర్ల నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చందుర్తి వద్ద ఒకరికి..

చందుర్తి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డ-చందుర్తి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన మోతె రాములు బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. రాములకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందిచారు. చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది వెంకటరెడ్డి, చాణక్య తెలిపారు.

ఇసుక టాక్టర్ల పట్టివేత

వీణవంక, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు టాక్టర్లను పోలీసులు పటుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొర్కల్ గ్రామానికి చెందిన కొందరు టాక్టరు యజమానులు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తుండగా పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పాఠశాలలోకి పాము

ఎలిగేడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాము చొరబడింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఏడాది క్రితం పాఠశాలను ఆనుకొని వన నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతుండటంతో తరుచుగా పాములు, విషపురుగులు తరగతి గదుల్లోకి వస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పాములు మూడుసార్లు తరగతి గదుల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. నర్సరీని పాఠశాలకు దూరంగా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం వేణుకుమార్‌ను వివరణ కోరగా నర్సరీ మూలంగా విషసర్పాలు తరుచుగా వస్తున్నాయని పిల్లలు జంకుతున్నారని తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటలో బుధవారం తెల్లవారుజామున ఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. ఆలయాల తాళాలు పగులగొట్టి హుండీని ధ్వంసం చేశారు. అమ్మవారలపై ఉన్న పుస్తెలు, ముక్కు పుడక, మట్టెలు, మంగళసూత్రం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్తీ సిరప్‌పై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ సిరప్‌లు ఇచ్చి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పెద్దపల్లి పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన చిరంజీవి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీవాణికి ఫిర్యాదు చేశారు. రెండురోజులు క్రితం చిరంజీవి తన కుమారుడు అస్వస్థతకు గురికావడంతో పట్టణంలోని ఒక పిల్లల డాక్టర్ వద్దకు చికిత్స కోసం తీసుకువెళ్లానని తెలిపారు. అక్కడ డాక్టర్ పరీక్షించి సిరప్‌తో పాటు టాబ్లెట్లు రాశారని పేర్కొన్నారు. ఆసుపత్రి పక్కనే గల మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేశానని తెలిపారు. ఇంటికి వెళ్లిన తర్వాత సిరప్ మూతతీసిన తర్వాత అందులో ఏవేవో తేలియాడుతూ కనబడ్డాయని, ఆ సిరప్ పిల్లలకు తాగిస్తే ప్రాణం పోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిరప్‌ను తీసుకునివెళ్లి మెడికల్‌షాపు యజమానిని ప్రశ్నిస్తే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. డీఎంహెచ్‌వోతో పాటు డ్రగ్ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశానని చిరంజీవి పేర్కొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పట్టణంలోని రాథోడ్ నాందేవ్ అనే ఉపాధ్యాయుడు తాను అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి శనివారం స్వంత గ్రామానికి వెళ్లాడు. గ్రామం నుంచి వచ్చిన ఆయన బుధవారం వచ్చి ఇంటి తాళం తెరచి ఇంటి లోపలికి వెళ్లి చూసే సరికి బీరువా తెరచి, సామాన్లు చిందర వందర చేసినట్లు గుర్తించారు. అలాగే బీరువాలో దాచి ఉంచిన రూ. 15,000 నగదు, అరతులం బంగారం వచ్చిన వ్యక్తులు అపహరించారు. అదే విధంగా జర్మనీలో ఉంటున్న కొరిడె సత్యన్న ఇంటి తాళాలు కోసి చోరీకి విఫలయత్నం చేసినట్లు తెలుస్తుంది. సత్యన్న ఇంటిలో తులంనర బంగారం, వెండి పంచపాల చోరీ జరిగినట్లు తెలుస్తుంది, జర్మనీ నుంచి సత్యన్న వస్తే ఇంటిలో ఇంకా ఏమి దొంగిలించారో అనేది తెలుస్తుంది. సంఘటనా స్థలాన్ని ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ సందర్శించారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

● చెట్ల పొదల్లో ఆలయ హుండీ

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ స్టేజీ నుంచి కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెట్ల పొదల్లో ఆలయానికి సంబందించిన హుండీ పడేసి ఉన్నది. ఇదే గ్రామానికి చెందిన శ్యామకూర సంపత్‌రెడ్డి చెట్ల పొదల్లో ఉన్న హుండీని గమనించారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్సై సాయికృష్ణకు సమాచారం అందించినాడు. అక్కడికి చేరుకున్న ఎస్సై హుండీ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు హుండీ చోరీ జరిగినట్లు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై తెలిపారు. ప్రస్తుతం హుండీని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.



ధర్మపురిలో తెరిచి ఉన్న బీరువా



చెట్ల పొదల్లో పడేసిన హుండీ

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

ముత్తారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన గుర్రాల శ్రీనివాస్ తారక దంప తుల కూతురు అబిజ్ఞ(18నెలలు) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ మేరకు చిన్నారికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కాగా ఆ పాప ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మళ్లీ అదే ఆసుపత్రికి బుధవారం చికిత్స నిమిత్తం తీసుకు వెళ్లారు. దీంతో వైద్యులు ఇంజెక్షన్ వేసి, మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. కాగా ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి చిన్నారికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యు లు చిన్నారి మృతిచెందినట్లు తెలిపారు. దీంతో అబిజ్ఞ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తన కూతురు మృతిచెందినట్లు ఆరోపించారు. తమ కుమార్తె ప్రాణాలు తీసిన సదరు ఆసుపత్రి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ ఘటనతో లక్కారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేపు యాదవులకు రాజకీయ శిక్షణ తరగతులు

తిమ్మాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఉమ్మడి జిల్లాలోని యాదవ కులస్తులకు అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సొగని కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న శుక్రవారం రాజకీయ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని రామకృష్ణ కాలనీలో యాదవ సంఘం భవనంలో సంఘం నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. మానకొండూర్ మండలం ఖాదర్‌గుడెంలోని ఫామ్ అరవింద ఫామ్‌లో రాజకీయ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు ఆవుల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్మంలో నందవేణి ప్రసాద్, బాబుర్ కుమార్, జంగా శ్రీనివాస్, నరసయ్య, పోలం అంజయ్య, ఆవుల అంజయ్య, హనుమంతు, వేల్పుల ఓదెలు, భూపతి, గోపాల్, పొలం మల్లేష్, రాజయ్య, రమేష్, సంపత్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న యాదవుల సంఘం నాయకులు

ఘనంగా సామూహిక కార్తీక దీపోత్సవం


భీమేశ్వర ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. రాజన్న దేవాలయ సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమం ప్రతీ రోజు రాత్రి నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాశ్వత ఆకాశ దీపం ప్రారంభించిన అర్చకులు..

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస దీపోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నెలరోజుల పాటు వెలిగే శాశ్వత ఆకాశ దీపాన్ని ఆలయ అర్చకులు ప్రతిష్టించారు.

గోదావరికి ఘనంగా హారతి


గోదావరి నది వద్ద గంగాహారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. గోదావరి నది వద్ద హారతి కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, భక్తులు హారతి ఇచ్చి నదిలో దీపాలు వదిలి పెట్టారు. రామలింగేశ్వర, అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి వారలకు, అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నిర్మించారు.. నిరుపయోగంగా వదిలేశారు..

- రూ. 2.90 కోట్లతో నిర్మించినా..
- రోడ్లపక్కనే కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు
- రెండో బైపాస్ రోడ్డులో పొంచివున్న ప్రమాదం



నిరుపయోగంగా ఉన్న నూతన కూరగాయల మార్కెట్


రెండో బైపాస్‌లో నిర్మిస్తున్న షెడ్లు

వేములవాడ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. వేములవాడ పట్టణంలో రైతులు, వ్యాపారులు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుగా అప్పటి ప్రభుత్వం పోలీస్ స్టేషన్ ఎదురుగా గర్ల్స్ హైస్కూల్ పక్కన పదివేల అడుగుల విస్తీర్ణంలో సుమారుగా రూ.2.90 కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టారు. నూతన భవనంలోకి వ్యాపారులు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. మార్కెట్ భవన నిర్మాణం రెండు సంవత్సరాల క్రితం పూర్తయినప్పటికీ ప్రారంభంలో ఆలస్యం జరిగింది. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో అప్పటి మంత్రి చేతుల మీదుగా కూరగాయల మార్కెట్ భవనాన్ని ప్రారంభించారు.

అయితే ఇప్పటివరకు రైతులు, వ్యాపారులకు స్టాల్స్ కేటాయించలేదు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు స్టాల్స్ కేటాయించేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానించినా వ్యాపారులు చొరవ చూపకపోవడంతో పది మంది మాత్రమే ముందుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

వ్యాపారులు, రైతులు ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండో బైపాస్‌లోని రోడ్డు పక్కన రైతులు తాత్కాలిక షెడ్లు వేసుకుని కొంత మంది, మరికొంత మంది రోడ్డుపక్కన, రోడ్డుపైన కూరగాయల విక్రయిస్తున్నారు. రెండో బైపాస్ రోడ్డులో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతాయి. దీంతో భారీ వాహనాలు వెళ్లే క్రమంలో రైతులకు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. రెండు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండటంతో భవనం దెబ్బతినే పరిస్థితి ఉందని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కరోనా సమయంలో తరలింపు..

ఉప్పుగడ్డ వీధిలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను కరోనా సమయంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అక్కడినుంచి తరలించారు. వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండులోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోకి తరలించారు. మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో కూరగాయల వ్యాపారులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో రెండవ బైపాస్ రోడ్డులోని మూలవాగు ఒడ్డున తాత్కాలికంగా ఏర్పాటు చేయగా మరికొందరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. పట్టణంలోని కోరుట్ల బస్టాండు సర్వాయిపన్న విగ్రహం వద్ద తెల్లవారు జామున ఉదయం 4 గంటల నుంచి రైతులు కూరగాయలు తీసుకువచ్చి రోడ్డుపైన విక్రయించడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

68 షెడ్ల నిర్మాణం..

వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కూరగాయల మార్కెట్‌లోకి రైతులు, వ్యాపారులు వెళ్లేందుకు మొగ్గు చూపలేదు. గత ప్రభుత్వం తమ అభిప్రాయం తెలుసుకోకుండా కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టిందని, భవనం కూరగాయలు విక్రయించేందుకు అనువుగా లేదని రైతులు, వ్యాపారులు అందులోకి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో రైతుల, వ్యాపారుల నిర్ణయం మేరకు రెండో బైపాస్‌రోడ్డులో మూలవాగు పార్కును ఆనుకుని కూరగాయల విక్రయానికి షెడ్లు నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో రూ.86 లక్షలతో 68షెడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 70శాతం పనులు పూర్తికాగా, మిగిలిన పనులను నెలరోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు.


రోడ్డుపై కొనసాగుతున్న మార్కెట్(ఫైల్)

కాకతీయ కాలువకు నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల బుధవారం కొనసాగింది. డ్యామ్ నుంచి కాకతీయ కాలువ కు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు వదిలారు.

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కమిటీలో జగిత్యాల వాసులు


జీఆర్ దేశాయి


పీసీ హన్మంత్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ గౌరిశెట్టి రామూర్తి దేశాయి, పి. హన్మంత్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి ఈ ఎన్నికల్లో జీఆర్ దేశాయి రాష్ట్ర కార్యదర్శిగా, పి.హన్మంత్‌రెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయినట్లు హరి అశోక్ కుమార్ తెలిపారు. వీరికి గురువారం జగిత్యాలలో పౌర సన్మానం జరపనున్నట్లు ఆయన తెలిపారు.

అర్బన్ బ్యాంకులో ఎన్నికల కోలాహలం



అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

- రెండో రోజు 35 నామినేషన్లు
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ
- రేపు పరిశీలన

కరీంనగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకులో బుధవారం ఎన్నికల కోలాహలం కనిపించింది. నామినేషన్ల స్వీకరణ రెండో రోజు బుధవారం 34 మంది అభ్యర్థులు 35 నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్‌కు అందించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు డైరెక్టర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి మద్దతుదారులతో నామినేషన్లు ఎన్నికల అధికారికి సమర్పించారు. మాజీ చైర్మన్లు గడ్డం విలాస్‌రెడ్డి తన ప్యానల్‌లోని డైరెక్టర్ పదవులకు పోటీచేస్తున్న అభ్యర్థులతో కలిసి నామినేషన్లు వేయగా, కర్ర రాజశేఖర్ ఆయన మద్దతుదారులు, ఆయన ప్యానల్‌లోని డైరెక్టర్లతో కలిసి వచ్చి నామినేషన్ పత్రాలను అందించారు. స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

మంగళవారం మొదటిరోజు ముగ్గురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా బుధవారం రెండో రోజు 34 మంది 35 నామినేషన్ల సెట్లను దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు. శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తారు. మహిళా కేటగిరీలో ముద్దసాని శ్వేత, కంజర్ల రేణుక, మూల లక్ష్మి, ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలకు లింగంపల్లి సత్యనారాయణ, అలుగు విద్యాసాగర్, సరిళ్ల రత్న కుమారి, బత్తుల రాజ్‌కుమార్, లింగంపల్లి శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. జనరల్ కేటగిరీలో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, బండి ప్రశాంత్ దీపక్, ఎడబోయిన శ్రీనివాస్, తాడ వీరారెడ్డి, ఎండి. కలీంఖాన్, ఎండీ బబ్లూ, కస్తూరి వరప్రసాద్, గుండ కిషన్, తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, ఎండీ ముజీబ్‌హుస్సేన్, ఎలగందుల మునీందర్, ఇ లక్ష్మణ్‌రాజు, వొడ్నాల రాజు, బొమ్మరాతి సాయికృష్ణ, బాశెట్టి కిషన్, నాగుల సతీష్‌గౌడ్, దేశబోయిన వేద్రాద్రి, దరణికోట దామోదర్, మూల వెంకట రవీందర్‌రెడ్డి, కైలాస్ నవీన్, అనురాస్‌కుమార్, మంగి రవీందర్, లక్కిరెడ్డి కిరణ్, కూసరి అనిల్, నార్ల శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. ఉయ్యాల ఆనందం రెండ్లు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు.

బ్యాంకును అభివృద్ధి చేస్తాం

మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్

బ్యాంకు డిపాజిట్లను 200 కోట్లకు పెంచడంతోపాటు వాటిని వివిధ రకాల రుణాలను అందించి బ్యాంకును లాభాలబాటలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాము. మరోసారి అవకాశమిచ్చి ప్యానల్‌లోని అభ్యర్థులందరిని డైరెక్టర్లుగా గెలిపించాలి.

లాభాల బాటలో నడిపిస్తాం

మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

బ్యాంకును లాభాలతో ముందుకు తీసుకెళ్ళడమే ప్రధాన లక్ష్యంగా పోటీ చేస్తున్నాము. మాకు అవకాశమివ్వాలని కోరుతున్నాం. డిపాజిట్ల సేకరణతోపాటు ఆ డబ్బులను రుణాల రూపంలో సభ్యులు, ఖాతాదారులకు అందిస్తూ లాభాలను గడించేందుకు చర్యలు తీసుకుంటాం.

ముమ్మరంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు..

- గంటపాటు రాజన్న దర్శనానికి అంతరాయం
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు


రాజన్న ఆలయ లడ్డూ గోదాంను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం రాజన్న దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ఉదయం 10గంటల వరకు రాజన్న దర్శనాలకు భక్తులను అనుమతించారు. అంతరాలయంలోని గోపురాల పైకప్పున రేకులను తొలగించే క్రమంలో భక్తులపై పడకుండా ఉండేందుకు గంటపాటు దర్శనాలకు అంతరాయం కలిగింది.

అంతే కాకుండా మరో గంటపాటు స్వామి వారికి నివేదన ఉండటంతో రెండు గంటల సమయంలో గోపురాల పైకప్పు పెద్ద రేకులు, భారీ ఇనుప పైపులను తొలగించారు. రెండు గంటలపాటు దర్శనాలకు అంతరాయం కలగడంతో భక్తులు ఉత్తరం ద్వారం వద్ద రాజన్న దర్శనం కోసం నిరీక్షించారు. రేకులు తొలగించిన తదనంతరం భక్తులకు దర్శనాలను యథావిధిగా కొనసాగించారు.


ఆలయం ముందు నుంచి భక్తుల దర్శనాలు

రాజన్న, భీమన్న ఆలయాల్లో భక్తుల రద్దీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయంలో అభివృద్ధి పనుల జరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భీమన్న ఆలయంలో స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. దీంతో భీమన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. అంతే కాకుండా భక్తులు రాజన్న ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రచార రథం వద్ద సందడిగా కనిపించారు. ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

లడ్డూల గోదాం కూల్చివేత..

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా రాజన్న ఆలయం చుట్టూ ఉన్న భవనాలను ఇప్పటికే కూల్చివేశారు. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులకు పూర్తి స్థాయిలో పనులను అప్పగించడంతో ఆలయాన్ని ఆనుకుని ఉన్న లడ్డూల గోదాంను బుధవారం కూల్చి వేయడం ప్రారంభించారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ధర్మగుండం నుంచి ఆలయం ముందుకు వెళ్లేందుకు నిలిపివేశారు. భక్తుల దర్శనాలకు అంతరాయం కలగకుండా వేగంగా అభివృద్ధి విస్తరణ పనులు చేపడుతూనే భక్తులకు దర్శనాలను అనుమ తిస్తూ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన ఈవో రమాదేవి..

వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈవో రమాదేవి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రాజన్న ఆలయం ముందు తూర్పు ద్వారం నుంచి భక్తుల దర్శనాలకు అనుమతినిచ్చారు. దీంతో ఆలయం ముందు స్వతహాగా గంటలపాటు క్యూలైన్‌లో వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈవోతో పాటుగా ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రాజేందర్ ఆలయ ఉద్యోగులు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

రాజన్న సేవలో కేంద్ర మంత్రి సతీమణి..

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ దర్శించుకున్నారు. రాజరాజేశ్వర స్వామి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రమాదేవి అమ్మవారి వస్త్రాలు, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి ఖో-ఖో, హ్యాండ్‌బాల్ క్రీడలు ప్రారంభం




తిమ్మాపూర్‌లో ఎస్‌జీఎఫ్ఐ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు, గంభీరావుపేట మండలంలో విజేతలకు బహుమతులు అందజేత


తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రాంగణంలో బుధవారం ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 బాలబాలికల ఖోఖో ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 22 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌ను శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం అని ఓడిన వారు నిరాశ పడకుండా గెలుపు కోసం ప్రయత్నం చేయాలని, గెలుపొందిన వారు మరింత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయంతో పాటు క్రీడా ప్రాంగణాన్ని అందించినందుకు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్‌జీఎఫ్ఐ జనరల్ సెక్రటరీ వేణు గోపాల్‌రావు, ఎస్‌జీఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్‌రావు, డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, కోచ్‌లు, పీఈటీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్- 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీల్లో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిజిల్లా నుంచి బాలుర, బాలికలు రెండేసి జట్ల చొప్పున మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతల బహుమతుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా కిసాన్ సెల్ జాయింట్ సెక్రెటరీ దమ్మ శ్రీనివాస్‌రెడ్డి నగదు అందజేశారు. రాజుపేటకు చెందిన మల్లేశం, కొత్తపల్లికి చెందిన షాదుల్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గంగారాం, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నారాయణ, పీడీ భాను ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

రాయికల్: రాయికల్ మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థిని వేముల తన్వి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 16న సంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల బడ్డీ పోటీల్లో తన్వి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఏఈటీ వి.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు అభినందించారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దండారి ఉత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని బోర్నపెల్లి చిలుకగూడెంలో దీపావళి పండుగ సందర్భంగా గిరిజనులు దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు దండారి వేడుకల్లో భాగంగా చేసిన గుస్సాడీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని గ్రామ దేవత జంగుబాయి దేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఎంపీవో సుష్మా, మాజీ ము న్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, లత, రాజు, కవిత, శ్రీనివాస్, సత్యం, ముఖీద్, శ్రీనివాస్‌గౌడ్, గోపి, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో నీట్, ఐఐటి బోధించే అధ్యాపకులు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథంకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. రెగ్యులర్‌గా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ నిరసన తెలుపుతున్నట్లు అధ్యాపకులు తెలిపారు.

● సంక్షిప్తంగా..

మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. గ్రామంలోని 552 పశువులకు గాలికుంటు టీకాలు వేయడం జరిగిందని మండల పశువైద్యాధికారి సుశితారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎడ్ల అరవింద్‌రెడ్డి సిబ్బంది విజయలక్ష్మి, సంధ్యారాణి, మమత, పోచయ్య, కనుకయ్య, కిరణ్, అనిత, వెంకటయ్య, కొమురయ్య, రైతులు ఉన్నారు.

చొప్పదండి: మండలంలోని రాగంపేట ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అనాథ విద్యార్థి దీకొండ స్వాధ్విన్‌కు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, కె సాయన్న, కనకయ్య, శశికళ పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి మహాలక్ష్మీ ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 70 మంది గల కమిటీలో అధ్యక్షుడిగా పొన్నాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఇప్పలపల్లి శ్రీనివాస్, క్యాషియర్‌గా గీకురు మధు సూదన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ మాధవరావు ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు బుధవారం వేశారు. ఈ సందర్భంగా 275 పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. అమర్‌ఖాన్, అజహర్, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్, మానేరు డ్యాం రోడ్ ఉజ్వలపార్క్ సమీపంలోని రాధాగోవింద మందిరం ఇస్కాన్ టెంపుల్‌లో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం 5-30 గంటల నుంచి 8-30 వరకు కార్తీక మాసం సందర్భంగా ప్రభు నరహరిదాస్ నేతృత్వంలో భాగవత సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. చివరి రోజు 30న ఉదయం 10 గంటల నుంచి గోవర్ధనపూజ, గోపూజ జరుగుతుందని పేర్కొన్నారు.

25న పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న కరీంనగర్‌లో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. సైకిల్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్, రూట్ మ్యాప్‌ను కమిషనరేట్ కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శనివారం ఉదయం పోలీస్‌పరేడ్ గ్రౌండ్ నుంచి సైకిల్ ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో అక్టోబరు 31 వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'పనిప్రదేశంలో లింగ వివక్ష' అనే అంశంపై కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు, ఆ పైస్థాయి అధికారులకు 'క్షేత్ర స్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయడం' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. కమిషనరేట్‌కు చెందిన అన్ని పోలీసు స్టేషన్లు, వివిధ పోలీసు విభాగాల నుంచి మొత్తం 117 మంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

ఇల్లందకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి చెల్పూరి రాము అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడారు. తహసీల్దార్ మధ్యాహ్నం 12 గంటలు దాటినా విధులకు రావడం లేదని, కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రిజిస్ట్రేషన్‌లు ఉంటే ఉదయాన్నే వస్తున్నారని, లేకుంటే ఎప్పుడు వస్తారో తెలియడం లేదని అన్నారు. విషయమై తహసీల్దార్ రాజమల్లును వివరణ కోరగా చిన్నకోమటిపల్లె, టేకుర్తిలో భూభారతి దరఖాస్తుల పరిశీలనకు వెళ్లినట్లు తెలిపారు.

సంగీత పోటీల్లో పారమిత విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు

భగత్‌నగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సంగీత పోటీల్లో పారమిత విద్యార్థులు ప్రతిభ చాటారు. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో సంగీత పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారమిత డ్రీమర్స్ డ్రీమ్, లోక్నో ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సంగీత పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారన్నారు. వాయిద్య సంగీత విభాగంలో 7వ తరగతికి చెందిన కిట్ల చరణ్ జాతీయ స్థాయిలో ఏడో స్థానం, 6వ తరగతికి చెందిన కార్తీక్ జాతీయ స్థాయిలో 24వ స్థానం, గాత్ర సంగీత విభాగంలో 8వ తరగతికి చెందిన సోనాక్షి సురేష్ జాతీయ స్థాయిలో 17వ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను సంగీత ఉపాధ్యాయులు మణిశర్మ, కిరణ్‌కుమార్‌ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేష్, వీయూఎం ప్రసాద్, వినోద్‌రావు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్తలు భవానీ, రబీంద్ర పాత్రో, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఈ-టెక్నోలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు



పోటీలను పారంభిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్-17 కరీంనగర్ జిల్లా స్థాయి బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీలను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడాకారుల మేధస్సు పదునుగా ఉంటుందన్నారు. అంతకుముందు ట్రయల్ గేమ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్‌రావు, పీఈటీల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, జీనియస్ చెస్ అకాడమి నిర్వాహకుడు కొంకటి అనూప్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలను పరిశీలించిన ఏడీఏ

ఇల్లందకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాలలో పత్తి పంటను హుజూరాబాద్ ఏడీఏ సునీత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఐ తీసుకొచ్చిన కపాసు కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్‌పై రైతులకు వివరించారు. అనంతరం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.ఏవో సూర్యనారాయణ, ఏఈవో సంపత్ పాల్గొన్నారు.

ఘనంగా స్వేరోస్ డే

హుజూరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం స్వేరోస్ డే వేడుకలను జిల్లా అధికార ప్రతినిధి ఆకినపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. స్వేరోస్ నాయకులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విష్ణువుకు, శివుడికి ప్రీతికరమైన కార్తీక మాసం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం రాత్రి దీపారాధనతోపాటు ఆకాశ దీపాలు ప్రారంభించారు. ఆలయాల నిర్వాహకులు, అధికారులు భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.



శ్రీరాంనగర్‌కాలనీ శ్రీరామమందిరంలో ఆకాశదీపం

కొనుగోలు కేంద్రం ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం తుమ్మనపల్లి, మందాడిపల్లి, సింగాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా పీఏసీఎస్ చైర్మన్ కౌరు సుగుణాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

బేతిగల్‌కు ఆర్టీసీ సేవలు ప్రారంభం



బస్సు సేవలను ప్రారంభిస్తున్న ప్రణవ్

వీణవంక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ నుంచి జమ్మికుంట, కరీంనగర్‌కు వెళ్లేందుకు బుధవారం ఆర్టీసీ బస్సు సేవలను హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ ప్రారంభించారు. కల నెరవేరడంతో గ్రామస్థులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, వొడితల ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కొమ్మిడి రాకేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సాహెబ్ హుస్సేన్, అనిల్ గౌడ్, శ్రీపతిరెడ్డి, సునీల్, ఐలయ్య, సతీష్ తదితరులున్నారు.

వీణవంక: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి అనారోగ్యానికి గురికాగా బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ వల్బాపూర్‌లోని ఇంటి వద్ద పరామర్శించారు. అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. బేతిగల్ 4, వల్బాపూర్‌లో దాదాపు మూడు లక్షల పదిహేను వేల విలువ చేసే మూడు చెక్కులు అందించారు. వీరి వెంట నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, కొమ్మిడి రాకేష్‌రెడ్డి,నల్ల కొండాల్ రెడ్డి,చాడ రాజేందర్ రెడ్డి,పోతరవేన సతీష్ యాదవ్,జీడి దేవేందర్,సునీల్ శ్రీపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

'జాగృతి'లో పలువురి చేరిక

కరీంనగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పలువురు మహిళలు తెలంగాణ జాగృతిలో చేరారు. బుధవారం నగరంలోని జాగృతి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా బ్యూటీపార్లర్ అసోసియేషన్ అధ్యక్షురాలు రూపతోపాటు పలువురు మహిళలు జాగృతిలో చేరగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, మహిళా అధ్యక్షురాలు అక్కం శివరాణి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ కవిత జాగృతి ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటాలు ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. జాగృతి ఆటో సంఘం నాయకుడు కొత్తూరి రఘు, మహిళా నాయకులు విజయ, అనూష, కవిత, శ్రీమతి, జ్యోతి, అనిష, రమ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు అన్నివర్గాలకు మేలు

చొప్పదండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో వస్తువుల ధరలు తగ్గి అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండిలో బుధవారం బీజేపీ నాయకులు పలు వ్యాపార, వాణిజ్య సంస్థలను సందర్శించి జీఎస్టీ అమలు తీరుతెన్నులను పరిశీలించారు. పట్టణ అధ్యక్షులు చిల్ల శ్రవణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాణ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల అధ్యక్షులు మహేష్, శివ, జిట్ట కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

అధికారుల శ్రమదానం

గన్నేరువరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లిలో త్వరలో జరుగబోయే శ్రీరంగనాయక స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా రంగనాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో శ్రమదానం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ శ్రమదానం చేశారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొమురంభీం జయంతి

హుజూరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కొమురంభీం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్, నాయకులు కోయాల అంజి, అభిలాష్, సాయి, చరణ్, సిద్ధు పాల్గొన్నారు.

అల్పాహారం, అన్నప్రసాద వితరణ



అల్పాహారం అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరు స్వామి 69వ తిరునక్షత్సోవాల్లో భాగంగా బుధవారం వికాసతరంగిణి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో రోగులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం అన్నప్రసాద వితరణ చేశారు. కె.గౌతమరావు, సిరికొండ వెంకటేశం, ప్రతాపరెడ్డి, ప్రభాకర్‌రావు, కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

● హౌసింగ్‌బోర్డు కాలనీలోని వీర బ్రహ్మేంద్ర అనాథ వృద్ధాశ్రమంలో సుమారు 70 మందికి అల్పాహారం అందజేశారు. ఆరణి, శ్రీచరణ్‌రావు, కొండరాజు, లత, శ్రీలత, రాజేశ్వర్‌రెడ్డి, భాస్కర్, ఆశ్రమ నిర్వాహకుడు వీరమాధవ్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణం ఏరియా ఆస్పత్రిలోని రోగులకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవంలో భాగంగా వికాస తరంగిణి సభ్యులు బుధవారం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. వికాస తరంగిణి హుజూరాబాద్ శాఖ అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అంజనీదేవి, నిరంజన్‌కుమార్, శ్రీవాణి, శ్రావణ్, చైతన్య, శ్రీనివాస్, శ్రీధర్, సత్యదర్శన్, సుమన్, శ్రీయ, విష్ణుప్రియ, అమూల్య పాల్గొన్నారు.

టీకాలు క్రమం తప్పకుండా వేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఐవో డాక్టర్ సాజిద్ పర్వీన్

సైదాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలని, వేసిన టీకాల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్(డీఐవో) డాక్టర్ సాజిదా పర్వీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, నిల్వ ఉన్న వ్యాక్సిన్‌లను పరిశీలించారు. కోల్డ్ స్టోరేజ్, ఉప కేంద్రాలకు వ్యాక్సిన్ రవాణా లాజిస్టిక్స్ తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. దుద్దెనపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న టీకా సెషన్‌ను, అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించారు. వారి వెంట డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ అనురాగ్ రేఖా ఉన్నారు.

అదనపు బస్సు సౌకర్యం కల్పించాలి

గన్నేరువరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి మండల కేంద్రానికి అదనంగా బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మానేరు బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్, బీజేపీ నాయకుడు పుల్లెల రాము వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రానికి ప్రస్తుతం రెండు బస్సులు మాత్రమే నడుస్తున్నాయని, అందులో ఒకటి పొత్తూరు మీదుగా మరొకటి గుండ్లపల్లి మీదుగా గన్నేరువరానికి నడుస్తున్నాయన్నారు. ఖాసింపేట మానసాదేవి ఆలయాన్ని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉంటున్నారన్నారు. అదనపు బస్సుల కోసం రూట్లను పరిశీలిస్తామని మంత్రి తెలిపినట్లు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

కరీంనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కి చెందిన జగదీష్ బుధవారం సాయంత్రం ఐదు గంటలకి కరీంనగర్ బస్టాండ్ నుంచి రాంనగర్‌కి వస్తుండగా ఆటోలో తన బ్యాగు మర్చిపోయాడు. బ్యాగులో విలువైన సర్టిఫికెట్స్‌తోపాటు నగదు ఉంది. అతను వెంటనే డయల్ 100కు ఫోన్ చేశాడు. కరీంనగర్ టూ టౌన్‌కి చెందిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ మీర్జా షాబీర్ షేక్ తొందరగా స్పందించాడు. ఆటో ఆచూకీ కనుక్కొని చింతకుంట వరకు వెళ్లి బ్యాగు తీసుకొని జగదీష్‌కు అందించారు. అత్యవసర సమయంలో త్వరగా స్పందించిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ సాబీర్ షేక్‌ను సీపీ సృజన్‌రెడ్డి అభినందించారు.

స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిగురుమామిడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులు అన్ని స్థానాల్లో పోటీలో ఉండాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు నాగారం సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో యాదవ సంఘం నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాదవ సంఘం నాయకులకు, మానకొండూర్ మండలంలోని ఖాదర్‌గూడెం శివారులో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. యాదవ సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర సదానందం యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాపవేణి మల్లేశం యాదవ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు కార్యాచరణ

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. క్వింటాల్‌కు 500 చొప్పున మెట్రిక్ టన్నుకు ఐదు వేల రూపాయల 66.92 కోట్ల రూపాయలు రైతులకు బోనస్‌గా లభించనున్నాయి. ధాన్యం కొనుగోలు చేసిన 72 గంటల్లోగానే ధాన్యం డబ్బుతోపాటు బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించారు.

● రబీ బోనస్ ఏది?

రబీ సీజన్‌లో జిల్లాలో 32,694 మెట్రిక్ టన్నుల సన్న వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలు విక్రయించారు. దీనికి 500 రూపాయల చొప్పున 16.35 కోట్ల రూపాయల బోనస్ రావాల్సి ఉంది. ఐదు నెలలు గడినాఆ ఆ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఈ ధాన్యానికి సంబంధించిన డబ్బు 15 రోజుల్లోగానే రైతుల ఖాతాల్లో జమ అయినా, బోనస్ సొమ్ము ఎప్పుడు వచ్చేది వ్యవసాయశాఖ కాని, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కానీ రైతులకు చెప్పలేకపోతున్నాయి. రబీ సీజన్ బోనస్ చెల్లింపు విషయంలో ప్రభుత్వం నుంచి వచ్చే సమాచారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ సీజన్ బోనస్ 72 గంటల్లో జమ చేస్తామని మంత్రి ప్రకటన వచ్చింది. రబీ బోనస్ గురించి ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది.

అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులదే విజయం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులదే విజయమని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి చెందిన అభ్యర్థులే ఎక్కువ సంఖ్యలో పోటీలో ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అర్బన్‌బ్యాంక్ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ చదరంగ పోటీలకు జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ జెన్‌నెక్స్ పాఠశాల విద్యార్థి అక్కినపల్లి విస్తృత్ రామ్ ఎంపికయ్యాడు. ఇటీవల పెద్దపల్లిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విస్తృత్‌రామ్ ప్రతిభచాటాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి విద్యార్థిని అభినందించారు.

అందుబాటులో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు

సైదాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీసీఎంఎస్‌లో 88 క్వింటాళ్ల కదిరి లేపాక్షి వేరుశనగ విత్తన కాయ 40శాతం సబ్సిడీతో అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వైదేహీ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని డీసీఎంఎస్ గోదాం వద్ద సబ్సిడీ వేరుశనగ పంపిణీని జిల్లా వ్యవసాయధికారి భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు.

వేదభవనంలో చిన్న జీయరుస్వామి తిరునక్షత్రోత్సవం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్న జీయరుస్వామి 69వ తిరునక్షత్సోవాల్లో భాగంగా బుధవారం వికాసతరంగిణి ఆధ్వర్యంలో వేదభవనంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆచార్య అష్టోత్తర శతనామ స్తోత్రం, నామావళి, ఆచార్య సందేశం, తీర్థగోష్ఠి నిర్వహించారు. చీటి విజయమ్మ అన్నప్రసాద వితరణకు సౌజన్యం అందించారు. కె గౌతమరావు, సిరికొండ వెంకటేశం, ప్రతాపరెడ్డి, బీవీ రావు, వంశీధర్‌రావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్ బాల్‌కు ఎంపిక

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని బిర్లాస్కూల్ విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ ఎంపికైనట్లు కోచ్ అనూష్ తెలిపారు. కరీంనరగ్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన బాస్కెట్ బాల్ అండర్-14 విభాగంలో విక్యాత్, నిత్య ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బబిత విశ్వనాథన్ అభినందించారు.

ఇసుక రవాణాను అరికట్టండి

కరీంగనగర్ రూరల్, అక్టోబర్ 33 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లో మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బొమ్మకల్ గ్రామస్థులు కోరారు. బుధవారం కలెక్టక్ పమెలా సత్పతికి ఫిర్యాదు చేశారు. రాత్రి పూట ఇసుక తరలిస్తున్నారని, లైసెన్స్ లేని వారు కూడా నడుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవీందర్, బి.శ్రీనివాస్, మల్లయ్య, సుధాక్, సతీష్, మహేందర్ ఉన్నారు.

ప్రకృతిని ప్రశ్నించడమే సైన్స్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో జరుగుతున్న ప్రక్రియలను నిరంతరం ప్రశ్నించడంతోనే సైన్స్ ప్రక్రియలు బయటపడతాయని ఎస్ఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కెప్టెన్ బుర్రా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సాయి మానేరు పాఠశాలలో జాతీయ రసాయన శాస్త్ర వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. నిత్య జీవితంలో జరిగే పలు రసాయన ప్రక్రియలను శాస్త్రవేత్తల పరంగా అధ్యయనం చేయాలని సూచించారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు.. ఆందోళనలో అన్నదాతలు

గంగాధర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంట చేతికొచ్చే దశలో వాతావరణంలో మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. మరోవైపు ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండడం, కేంద్రాలు ప్రారంభంకాక పోవడంతో దిగులు చెందుతున్నారు. గంగాధర వ్యవసాయ మార్కెట్ ఇప్పటికే నిండిపోయింది. వర్షపడితే గింజలు మొలకెత్తి నష్టపోయేకన్నా మిల్లులకు అమ్ము కోవడమే మేలంటూ క్వింటాల్‌కు 1800 చొప్పున తరలిస్తున్నారు.

టీకా కార్యక్రమాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

సైదాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఆకునూర్, పెర్కపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకా సెషన్ సైట్లను హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రమేష్, డాక్టర్ గుణవర్ధన్, వరంద తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రన్నరప్‌గా హుజూరాబాద్ జట్టు

హుజూరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 ఖోఖో పోటీల్లో హుజూరాబాద్ జట్టు బుధవారం రన్నరప్‌గా నిలిచింది. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో వివిధ మండలాల జట్లు పెద్దఎత్తున పాల్గొన్నాయి. హుజూరాబాద్ జట్టు లీగ్ దశ నుంచి ఫైనల్ వరకు అద్భుతంగా రాణించింది. ఫైనల్‌లో స్వల్ప తేడాతో ఓడింది. హుజూరాబాద్ జట్టుకు ట్రోఫీతోపాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుల ఎన్నిక

చొప్పదండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుల ఎన్నిక బుధవారం చొప్పదండిలో జరిగింది. మండల అధ్యక్షుడుగా కోమల్ల రాజేశం, చొప్పదండి అధ్యక్షుడిగా పిట్టల వెంకటేష్, రుక్మాపూర్ అధ్యక్షుడిగా తాటికొండ కొమురయ్య, భూపాలపట్నం అధ్యక్షుడిగా గణవేణి మల్లేశంతోపాటు పలు గ్రామాల అధ్యక్షులను ఎన్నుకున్నారు.

గర్షకుర్తిలో రెవెన్యూ అధికారుల భూసేకరణ గ్రామసభ

గంగాధర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం గర్షకుర్తిలో బుధవారం తహసీల్దార్ రజిత ఆధ్వర్యంలో భూసేకరణ గ్రామసభ నిర్వహించారు. కొత్తపల్లి, మనోహరాబాద్ రైల్వేలైను నిర్మాణంలో భాగంగా గర్షకుర్తి రెవెన్యూ పరిధిలో పలువురు రైతుల భూములు ముంపునకు గురవుతున్నాయి. ఇందులో భాగంగా గర్షకుర్తి రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభలో రైతుల పట్టదారు పాసుపుస్తకాలను పరిశీలించి ఎంత భూమి పోతున్నది వివరాలు సేకరించారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకుడికి సన్మానం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని కనుకులగిద్దెకి చెందిన మొగిలిచర్ల కిషోర్ వరుసగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించగా మంగళవారం గ్రామస్థులు సన్మాన సభ నిర్వహించారు. కిషోర్, ఆయన కుటుంబ సభ్యులను సన్మానించారు.